Email : telanganaveenaofficial@gmail.com


Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

epaper.telanganaveena.com

సంపుటి :1 | సంచిక: 318 | హైదరాబాద్ | శనివారం | 03 -08 - 2024 | పేజీలు: 8 | రూ.3/-




# టీచర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు

- తెలంగాణ సాధనలో వారి పాత్ర కీలకం
- 25వేలమందికి పదోన్నతులు కల్పించాం
- ఒకటో తేదీన జీతాలు పడేలా చేస్తున్నాం
- పేదల చదువుతోనే తెలంగాణకు భాగ్యం
- సర్కారీ బడికి వెళ్లడం ఆత్మగౌరవంగా భావించాలి
- పాఠశాలలకు ఉచిత విద్యుత్..మౌలిక వసతుల కల్పన
- ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులతో భేటీలో సిఎం రేవంత్






**తెలంగాణ వీణ/హైదరాబాద్, ఆగస్ట్2:**

తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవిష్యత్ ఎక్కడుందని ఈ క్షణం తనను అడిగితే వేలాది మంది ఉపాధ్యాయుల రూపంలో ఎల్బీ స్టేడియంలో ఉందని చెబుతానని ఉద్ఘాటించారు. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నాడు 30 వేల మంది ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఉపాధ్యాయులే తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌లు అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 25వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాం. 30 వేల మందిని బదిలీ చేశాం. ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు మీ ఖాతాలో పడేలా చూసే బాధ్యత మాది. ఈ సమ్మేళనంలో రాజకీయం, స్వప్రయోజనం లేదు.

వివరాలు 2లో

# జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం




- నోటిఫికేషన్లు..పరీక్షలు..తేదీల వివరాలు ప్రకటన
- అసెంబ్లీలో ప్రకటించిన డిప్యూటి సిఎం భట్టి
- గతంలో అస్తవ్యస్త విధానాలతో నిరుద్యోగులకు నిరాశ
- ఇచ్చిన హామీ మేరకు ముందుకు వెళుతున్నామని వెల్లడి

**తెలంగాణ వీణ/హైదరాబాద్, ఆగస్ట్2:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏయే ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేయాలనే విషయాలను క్యాలెండర్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసే నెల, పరీక్షలు ఎప్పుడు నిర్వహించాలనే వివరాలతో పాటు నియామకాలు నిర్వహించే ఏజెన్సీ, ఉద్యోగానికి కావాల్సిన అర్హతల గురించి అందులో పొందుపర్చారు. ఈ మేరకు జాబ్ క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1 పరీక్షలు అక్టోబరులో, గ్రూప్-2ను డిసెంబరులో, గ్రూప్-3 నవంబరులో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్దం పాటు అధికారంలో ఉన్నా, నిరుద్యోగులకు న్యాయం జరగలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయడంలో భాగంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు సార్లు గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దు అయిందని, ఉద్యోగాల భర్తీ పక్రియ గందరగోళంగా మార్చారని

వివరాలు 2లో

# జాబ్ క్యాలెండర్ పేరుతో మరోమారు మోసం

- ఉద్యోగాలు ప్రకటించకుండానే నిరుద్యోగుకలు మోసం
- ప్రజలు తిరగబడే రోజు తప్పకుండా వస్తుంది
- గన్‌పార్క్ వద్ద నిరసనలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్


2లో

# సభలో సమయానికి ఇవ్వని ఎజెండా

## ఇలా అయితే చర్చించేదెలా : అక్బరుద్దీన్




**తెలంగాణ వీణ/హైదరాబాద్, ఆగస్ట్2:** శాసనసభ ఎజెండాను అర్ధరాత్రి ఇవ్వ డం పట్ల ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఎజెండా ఒకటి ఇస్తున్నారు, సభలో మరొకదానిపై చర్చ నిర్వహిస్తున్నారంటూ మండిపడ్డారు. ఈ అంశంపై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సభలో ప్రస్తావించారు.ఒక్క పొలిటికల్ పార్టీ కోరికల మీద, ఇష్టం మీద అసెంబ్లీ నడవకూడదు.. అందరిని పరిగణలోకి తీసుకోవాలి అని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ప్రభుత్వానికి సూచించారు. ప్రతి రోజు మాకు ఎజెండా ఒంటి గంటకు వస్తుంది.. మొన్న మాత్రం 1:40 గంటలకు వచ్చింది. అప్పుడు వస్తే స్జబెక్ట్ మీద మేం ఎప్పుడు ప్రిపేర్ కావాలి.

వివరాలు 2లో

# నీట్‌లో విస్తృతస్థాయి లోపాలు జరగలేదు

- లీక్ కేవలం బీహార్, జార్ఖండ్‌లకే పరిమితం
- పరీక్షను రద్దు చేయాల్సిన అసవరం లేదు
- మరోమారు కీలక వ్యాక్యలు చేసిన సుప్రీం

**తెలంగాణ వీణ/ఢిల్లీ,ఆగస్ట్2:**నీట్ యూజీ 2024 పరీక్ష ప్రశ్నపత్నం లీకేజీ వ్యవహారంలో సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పరీక్షను రద్దు చేయాల్సిన అవసరం లేదంటూ ఇటీవల కీలక తీర్పునిచ్చిన ధర్మాసనం.. అందుకుగల కారణాలను వివరిస్తూ శుక్రవారం మళ్లీ తీర్పు వెలువరించింది. ఈసందర్భంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ లోపా లను ధర్మాసనం ఎత్తిచూపింది. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే లోపాలను సరిదిద్దుకోవాలని సూచించింది. నీట్ పేపర్ లీకేజీలో ఎలాంటి వ్యవస్థీకృత ఉల్లంఘనలు చోటుచేసుకోలేదు. పరీక్ష పవిత్రతను దెబ్బతీసేలా విస్తృత స్థాయిలో లీక్ జరగలేదు. ప్రశ్నపత్రం లీకేజీ ఝార్ఖండ్‌లోని హజారీబాగ్, బిహార్ లోని పట్నా వరకే పరిమితమైంది. దానిపై దర్యాప్తు జరుగుతోంది. అందుకే మేం పరీక్షను రద్దు చేయాలను కోలేదు. అయితే, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో కొన్ని లోటుపాట్లు ఉన్నా యి. విద్యార్థుల భవితకు సంబంధించిన అంశంలో ఇలాంటివి చోటుచేసుకోవడం సరికా దు. ఈ సమస్యను కేంద్రం ఈ ఏడాదే పరిష్కరించాలి. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్టీయేదేనని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.ఎన్టీయే పనితీరు, పరీక్షల్లో సంస్కరణల కోసం నియమించిన ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని కమిటీకి సుప్రీంకోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్యానెల్‌ను మరింత విస్తరించాలని పేర్కొంది. పరీక్షా విధానంలో లోపాలను సరిదిద్దడానికి అవసరమైన చర్యలపై కమిటీ సెప్టెంబరు 30లోగా తమ నివేదికను అందజేయాలని ఆదేశించింది. పరీక్షా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అంతర్జాతీయ సాంకేతిక సంస్థల సాయం తీసుకోవాలని సూచించింది. ఈ నివేదిక అందిన తర్వాత అందులోని అంశాలను అమలుచేసే అంశంపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని కేంద్రం, విద్యాశాఖను ధర్మాసనం ఆదేశించింది. ఈ ఏడాది నీట్ ప్రవేశపరీక్ష మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు రాశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. హరియాణాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడంతో అనుమానాలు తలెత్తాయి.పేపర్ లీకేజీ, ఇతర అక్రమాలపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం నీట్ యూజీ పరీక్షను మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేదని తీర్పు వెలువరించింది. మళ్లీ పరీక్ష పెడితే 24 లక్షల మంది ఇబ్బంది పడతారని కోర్టు అభిప్రాయపడింది.



# టీచర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని అన్నారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవం అని తల్లిదండ్రులు భావించాలి. అందుకు అందరం కలిసి కృషి చేయాలి. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమిస్తాం. పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తాం.. ఆ బిల్లు ప్రభుత్వమే చెల్లిస్తుంది. పేద పిల్లలు, దళిత వర్గాల పిల్లలు చదువుకుని బాగు పడితేనే రాష్ట్రం బలపడుతుంది. ఢిల్లీలో మూడుసార్లు కేజీవ్రాల్ గెలిచింది బస్తీల్లో పాఠశాలలు మెరుగుపరచడం వల్లే. మళ్లీ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఉండాలంటే మీరు పేదలకు చదువు చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.ప్రభుత్వ బడుల్లోనే చదువుకుని తాను ఈ స్థాయికి వచ్చానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది విద్యార్థులు ఉన్నారని... తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను ఉపాధ్యాయుల చేతుల్లో పెట్టారని వివరించారు. రాష్ట్రం వస్తే విద్యా విధానం బాగుపడుతుందనుకున్నాం.. ఉపాధ్యాయుల గౌరవం పెరుగుతుందనుకున్నామని చెప్పారు. కోదండరాం, హరగోపాల్, చుక్కా రామయ్య లాంటి వాళ్లకు గొప్ప గౌరవం దక్కుతుందని అనుకున్నామని కానీ తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఏం జరిగిందో చూశామని అన్నారు. గత పాలకులు ఉపాధ్యాయు లను ఏ విధంగా అవమానించారో చూశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ బడ్జెట్‌లో విద్యకు 10శాతం కేటాయించాలని భావించాం. కానీ హామీల అమలు దృష్ట్యా 7.3శాతం అంటే రూ.21వేల కోట్లకు పైగా కేటాయించాం. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 30వేల పాఠశాలల్లో.. 26లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారు..10వేల ప్రైవేట్ పాఠశాలల్లో.. 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో మీకంటే గొప్ప టీచర్లున్నారా? మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. తెలంగాణలో ఉద్యోగుల పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో కంటే దారుణంగా ఉంది.. ఇది కఠోర నిజం. టీచర్లు తేనెతుట్టె లాంటి వాళ్లు.. హాని చేయాలని చూస్తే తీనెటీగల్లా ఎదురుదాడికి దిగుతారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం కలిగించేందుకు ప్రతీ నెలా 1వ తేదీనే జీతాలు అందించేలా చర్యలు తీసుకున్నాం. పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్ల అంశాన్ని పరిష్కరించాం. మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ భవిష్యత్ మా చేతుల్లో కాదు..మీ చేతుల్లో ఉందని చెప్పేందుకే ఈ సమావేశం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నేను ఈ స్థాయికి చేరా. అలాంటి ప్రభుత్వ టీచర్లను కలుసుకునేందుకే ఈ ఆత్మీయ సమావేశం. టీచర్లంతా 90శాతం పైగా నిబద్ధతతో పనిచేయాలి.. విద్యార్థులకు విద్యనందించాలి. గత ఏడాదికంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2లక్షలకు పైగా విద్యార్థుల అడ్మిషన్లు తగ్గాయి. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవమని భావించేలా పాఠశాలలను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రభుత్వం వైపు నుంచి మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలకు బాధ్యత అప్పగించాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మహిళలకు బాధ్యత అప్పగించాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించాం. తెలంగాణ బలపడాలి అంటే మనందరం కార్యదీక్షతో పనిచేయాలని అన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టనుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాల్లో మినీ స్టేడియంల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. నైపుణ్యం లేకపోవడం వల్లే నిరుద్యోగం పెరుగుతోంది. అందుకే ముచ్చర్లలో 50 ఎకరాల్లో రూ.150 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసుకున్నాం. స్కిల్ యూనివర్సిటీలో యువకులకు నైపుణ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తాం. మీరు నేర్పే విద్యనే రేపటి తెలంగాణ భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే మీ లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరామ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గీతా కార్మికులకు రక్షణ కవచ్ మోకులను ప్రభుత్వమే పంపిణీ చేస్తుంది: మంత్రి



**తెలంగాణ వీణ/హైదరాబాద్, ఆగస్ట్2:** గీతా కార్మికుల ప్రమాదాల నుండి రక్షణ కోసం ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్ గుడా లో ప్రారంభించిన కాటమయ్య రక్షణ కవచ్ మోకులను పంపిణీ కి రంగం సిద్ధం చేసింది. ఆగస్టు 5 వ తేది నుండి ప్రతి నియోజకవర్గానికి వంద మోకుల చొప్పున మొదటి విడతల లో 10 వేల మోకులు పంపిణీ చేయనున్నట్లు రవాణా, మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ కాటమయ్య రక్షక్ కవచ్ మోకులను రాష్ట్ర వ్యాప్తంగా కల్లు గీత వృత్తి చేసుకునే ప్రతి ఒక్కరికీ ఈ మోకులను పంపిణీ చేస్తామని తెలిపారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం జరగనుందని పేర్కొన్నారు. కాటమయ్య రక్షణ కవచ్ పంపిణీ కోసం తెలంగాణ బడ్జెట్ లో కూడా ప్రత్యేకంగా నిధులుకేటాయించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## కాకతీయ చిహ్నాం తొలంగించరాదు: ఏలేటి

**తెలంగాణ వీణ/హైదరాబాద్, ఆగస్ట్2:** తెలంగాణ రాష్ట్ర చిహ్నాంలో మార్పులు చేయాలని బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్ అసెంబ్లీలో సూచించారు. చిహ్నాంలో కాకతీయుల ఫొటో తీయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. రాచరికపు చిహ్నాలను తొలగించాలని, ఈూ నుంచి ఈఉగా మార్చడంలో అభ్యంతరం లేదని ఏలేటి చెప్పారు. టెక్నికల్ ఛేంజ్ కాదు క్వాలిటేటివ్ ఛేంజ్ కావాలని ఆయన సూచించారు. ఏలేటి వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్ బాబు బదులిచ్చారు. ప్రజల అభిప్రాయం మేరకే మార్పులు ఉంటాయని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ కార్యాలయాలపై, బస్సులపై ఇప్పటికే ఈూను ఈఉగా మార్చిన సంగతి తెలిసిందే. వాహనాల రిజిస్ట్రేషన్ కూడా ఈఉ పేరుతో చేస్తున్న సంగతి తెలిసిందే.

## దానం వ్యాఖ్యలతో ఉద్రిక్తత

### నిరసనగా బిఆర్ఎస్ వాకౌట్

**తెలంగాణవీణ/హైదరాబాద్, ఆగస్ట్2:** తెలంగాణ అసెంబ్లీలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. హైదరాబాద్ నగరం లో అభివృద్ధి కార్యక్రమాలపై సభలో స్వల్పకాలిక చర్చ జరిగింది. చర్చను ప్రారంభించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. భారాస సభ్యులనుద్దేశించి పరుష పదజాలం ఉపయోగించారని ఆ పార్టీ సభ్యులు నిరసనకు దిగారు. దానం వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన భారాస సభ్యులు పోడియంవైపు దూసుకొచ్చారు. ప్రతిగా దానం కూడా పోడియంవైపు రావడంతో కాంగ్రెస్ సభ్యులు ఆయన్ను వెనక్కి తీసుకెళ్లారు. దానం నాగేందర్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్యే కేటీఆర్ భారాస సభ్యులతో కలిసి సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. దానం చేసిన వ్యాఖ్యల్లో అన్ పార్లమెంటరీ వ్యాఖ్యలు ఉంటే రికార్డుల నుంచి తొలగిస్తామని స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

## సభలో సమయానికి ఇవ్వని ఎజెండా

(మొదటి పేజీ తరువాయి)

25 ఏండ్ల నా అనుభవంలో ఇలా సభ జరగడం నేను ఎప్పుడు చూడలేదు అని అక్బరుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. శాసనసభ ఎజెండాపై అక్బరుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యానించిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సమర్థించారు. ఎజెండా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. శాసనసభ ఎజెండాపై మిత్రపక్షంగా మీరు కూడా స్పందించకపోతే ఎలా అని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ కోరారు. మీకు ఎజెండా అయిన వస్తుంది.. మాకు అది కూడా రావడం లేదంటూ అక్బరుద్దీన్ ఓవైసీతో కూనంనేని సాంబశివరావు అన్నారు.

## జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ ఐఏఎస్ లతో రెండు కమిటీలు ఏర్పాటు చేసి, వారి సూచనల్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పాత గ్రూప్ 1 నోటిఫికేషన్ రద్దు చేసి, 60 కొత్త పోస్టులతో మొత్తం 563 పోస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రూప్ 1 ప్రిలిమినరీ ఎగ్జామ్ కు 3 లక్షల మంది హాజరుకాగా, పరీక్ష సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటించామన్నారు. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్ 1 మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒక లక్షా 45 వేల 368 మంది హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలకు, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ ఎగ్జామ్ కు 1 లక్షా 6 వేల 2 వందల 60 మంది హాజరుకాగా, విజయవంతగా నిర్వహించాం. 32 వేల 4 వందల 10 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ చేశాం. అదనంగా 13,500 ఉద్యోగ ఖాళీల భర్తీకి అనుమతులు ఇచ్చాం. 11 వేల 62 ఖాళీలతో టీచర్ రిక్రూట్ మెంట్ కోసం డీఎస్సీ ఎగ్జామ్ ప్రకటించాం. జులై 18న ప్రారంభమై ఆగస్టు 5న ముగియనున్నాయి. 465 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఖాళీల భర్తీకి, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ లో 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశాం. పరీక్షల ప్రిపరేషన్ కు తగినంత సమయం లేదని అభ్యర్థులు కోరడంతో ఆగస్టు నుంచి డిసెంబర్ కు గ్రూప్ 2 ఎగ్జామ్ వాయిదా వేశాం. పరీక్షా తేదీలు ఒకటే కాకుండా, పరీక్షల మధ్య ప్రిపరేషన్ కు సమయం ఉండేలా అన్ని నియామక బోర్డులు ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాయని భట్టి విక్రమార్క ప్రకటించారు. గత ప్రభుత్వం నిర్వహించిన నియామక పరీక్షల పేపర్లు లీకయ్యాయి, పేపర్ల అమ్మకంతో పరీక్షలు రద్దయ్యాయి. పేపర్ లీక్ కారణంగా 2023 మార్చి 17న తొలిసారి గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దయింది. అభ్యర్థుల బయో మెట్రిక్ తీసుకోని కారణంగా హైకోర్టులో రెండోసారి ఎగ్జామ్ రద్దు అయింది. ప్రస్తుతం ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిరుద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి, కొత్త చైర్మన్ ను నియమించి వరుసగా పోస్టుల భర్తీని పూర్తి చేశాం. పాత నోటిఫికేషన్లను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్లు విడుదల చేసి, ఎగ్జామ్స్ సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తున్నామని' భట్టి విక్రమార్క పేర్కొన్నారు.ఇకపోతే షెడ్యూల్ ప్రకారం..వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్ నియామకాల కోసం సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల... నవంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. ట్రాన్స్‌కోలోని వివిధ ఇంజినీరింగ్ ఉద్యోగాల కోసం అక్టోబర్‌లో నోటిఫికేషన్.. వచ్చే ఏడాది జనవరిలో నియామక పరీక్షలు చేపడతారు. నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి వచ్చే ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహిస్తారు. వివిధ శాఖల్లో గెజిటెడ్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జనవరిలో నోటిఫికేషన్ విడుదల.. ఏప్రిల్‌లో పరీక్షలు చేపడతారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల .. ఏప్రిల్‌లో పరీక్షలు జరుగుతాయి. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ .. మేలో పరీక్షలు చేపడతారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వచ్చే ఏడాది జులైలో నిర్వహించ నున్నారు. ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తారు. డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టులకు వచ్చే ఏడాది జూన్‌లో నోటిఫికేషన్..సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది మేలో మరోసారి గ్రూపు2 నోటిఫికేషన్.. అక్టోబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది జులైలో గ్రూప్-3 నోటిఫికేషన్ నవంబర్‌లో పరీక్షలు జరుపుతారు. సింగరేణిలో పలు ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జులైలో నోటిఫికేషన్.. నవంబర్‌లో పరీక్షలు చేపడతామని ప్రకటనలో వివరించారు.

## జాబ్ క్యాలెండర్ పేరుతో మరోమారు మోసం

- ఉద్యోగాలు ప్రకటించకుండానే నిరుద్యోగుకలు మోసం
- ప్రజలు తిరగబడే రోజు తప్పకుండా వస్తుంది
- గన్‌పార్క్ వద్ద నిరసనలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్

**తెలంగాణ వీణ/హైదరాబాద్, ఆగస్ట్2:**మార్పు మార్పు అంటూ తెలంగాణ ప్రజలను ఎక్కువ రోజులు ఏమార్చలేరని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తప్పకుండా ప్రజలు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు. జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాల సంఖ్య ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దమ్ముంటే అశోక్‌నగర్‌కు వచ్చి.. నువ్వు ఇచ్చిన జాబ్ క్యాలెండర్ కరెక్ట్ అని చెప్పమని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. ఈ 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇచ్చిందని అక్కడ ఉన్న నిరుద్యోగులతో చెప్పించాలన్నారు. అలా చేస్తే మేమందరం రాజీనామా చేస్తామని సవాలు విసిరారు. రెండు లక్షల ఉద్యోగాలు బోగస్ అని కేటీఆర్ అన్నారు. ఈ విషయం మీకు కూడా తెలుసని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. మీరిచ్చిన జాబ్ క్యాలెండర్ బోగస్ అని తెలుసు.. అయినా కూడా పిల్లల్లో ఉద్వేగాల్ని రెచ్చగొట్టేవిధంగా లేని ఒక వాతావరణం నిర్మాణం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మీ క్యాలెండర్ బోగస్.. అందులో ఉద్యోగాలే లేవు. అందులో తారీఖులు తప్ప ఏమీ లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్‌పై చర్చ పెట్టమంటే రాష్ట్ర ప్రభుత్వం పారిపోయిందని ఎద్దేవా చేశారు. సిగ్గులేకుండా మళ్లీ మా ఎమ్మెల్యేలను సాటి ఎమ్మెల్యేతో ఒక బజారు భాషలో తిట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి, శాసనభకు చీకటి రోజు అని ఆయన వ్యాఖ్యానించారు. దుర్మార్గమైన పద్ధతిలో నిన్న, మొన్న మా అక్కల్ని అవమానించారని.. ఇవాళ ఒక సభ్యుడు అమ్మ, అక్క అని తిడుతుంటే శాడిస్టు మాదిరిగా ముఖ్యమంత్రి పైశాచిక ఆనందం పొందుతూ అందర్నీ ఉసిగొల్పుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఒక శాడిస్టు ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తప్పకుండా తెలంగాణ యువత తప్పకుండా రేవంత్ రెడ్డికి తగు రీతిలో సమాధానం చెబుతుందని హెచ్చరించారు.. ఎక్కువ రోజులు డ్రామా నడవదని స్పష్టం చేశారు. ఈ ఐదారు రోజుల శాసన సభ సమావేశాల్లో ప్రభుత్వం తేలిపోయిందని కేటీఆర్ అన్నారు. గవర్నమెంట్‌లో విషయం లేదు.. కేవలం ఊదరగొట్టే ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఏమీ లేవని తేలిపోయిందని కాబట్టే ఈ బజారు భాషతో మమ్మల్ని రెచ్చగొడు తున్నారని తెలిపారు. మంచిగా మాట్లాడుతుంటే కావాలనే ఉసిగొల్పి ప్రజల దృష్టి మరల్చే ఒక చీప్ ట్రాక్టిక్స్‌కు చేస్తున్నారని మండిపడ్డారు. ఈయన చీఫ్ మినిస్టర్ కాదు.. చీప్ మినిస్టర్ అని ఎద్దేవా చేశారు. ఒక శాడిస్టు ముఖ్యమంత్రిగా పైశాచిక ఆనందం పొందుతూ.. ఆడబిడ్డలను అవమానిస్తూ.. ఎమ్మెల్యేలను బూతులు తిట్టిస్తూ ఇష్టమొచ్చినట్టు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని అన్నారు. అందుకే అసెంబ్లీలో నిరసన చెప్పి బయల్దేరి గన్‌పార్క్ వద్దకు వచ్చి.. మా శాసన సభ్యులు, మండలి సభ్యులు అందరం వచ్చి మా నిరసన చెబుతున్నామని పేర్కొన్నారు. ఇకపోతే హైదరాబాద్ మీద కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెబుతుందని కేటీఆర్ మండిపడ్డారు. ఆ విషయంలో కూడా తప్పకుండా ప్రభుత్వాన్ని తూర్పార పడుదామని అనుకున్నామని చెప్పారు. కానీ బజారు భాషలో మాట్లాడేసరికి మా అక్క కోవ లక్ష్మీ దుఃఖం ఆపుకోలేక.. తమను బయటకు తీసుకొచ్చారని తెలిపారు. ఈ శాసనసభలో తెలంగాణ ప్రజలకు న్యాయం చేసే ముచ్చట్లు లేవని.. కేవలం కాంగ్రెస్ పార్టీ డ్రామాలు, కాంగ్రెస్ పార్టీ నాటకాలు తప్ప ఏమీ లేవని మండిపడ్డారు. అప్పులు, అప్పులు అని ఇన్ని రోజులు తప్పుడు కూతలు కూశారని చెప్పారు. అప్పులు లేవు.. ఈ రాష్ట్రం రెవెన్యూ సర్‌ప్లస్ స్టేట్ అని మేం ఎస్టాబ్లిష్ చేస్తే ఇవాళ నోరు మూసుకున్నారని తెలిపారు. అనేక విషయాలను డైవర్ట్ చేయడానికే మా అక్కల మీద నోరుపారేసుకుని.. కావాలని ప్రజల దృష్టి మరల్చే ఓ చిల్లర ప్రయత్నం చేస్తున్నాడు.. ఈ చిల్లర ముఖ్యమంత్రి అని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని గ్రహించాలని తెలంగాణ ప్రజలను విజ్ఞప్తి చేశారు. జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీలో చర్చించాలని అడిగితే రెండు నిమిషాలు కూడా టైమ్ ఇవ్వలేదన్నారు. నాలుగు పేపర్ల మీద ఇష్టం వచ్చింది రాసుకొచ్చి జాబ్ క్యాలెండర్ అంటున్నారని విమర్శించారు. తెలంగాణ శాసనసభ దుశ్శాసనసభగా మారిందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి కాంగ్రెస్ గెలిచింది. అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ ఇస్తామని ప్రకటనలు చేశారు.



## వయనాడ్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

- మృతుల సంఖ్య 300 దాటినట్లు గుర్తింపు
- డ్రోన్ ద్వారా గల్లంతయినవారి కోసం గాలింపు

**తెలంగాణ వీణ/తిరువనంతపురం,ఆగస్ట్2:** వయనాడ్‌లో కొండచరియలు సృష్టించిన విషాదం ఎన్నో కుటుంబాల్లో తీరనివేదన మిగిల్చింది. మృతుల సంఖ్య 300 దాటినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. దాదాపు 300 మంది ఆచూకీ లభ్యం కావాల్సి ఉందని కేరళ ప్రభుత్వం వెల్లడించింది. కూలిపోయిన భవనాలు, శిథిలాల కింద చిక్కుకున్నవారిలో ప్రాణాలతో బయటపడినవారి కోసం సహాయక చర్యలను ఉధృతం చేశారు. మృత్యుంజయులను గుర్తించేందుకు డ్రోన్ ఆధారిత రాడార్‌ను ఉపయోగించనున్నట్లు తెలుస్తోంది. భారత సైన్యం, నావికాదళం, ఎన్డీఆర్ఎఫ్, తీర రక్షక దళం.. ప్రభావిత ప్రాంతాల్లో కలిసికట్టుగా గాలింపుచర్యల్లో పాల్గొన్నాయి. ఒక్కో బృందంలో ముగ్గురు స్థానికులు, ఒక అటవీశాఖ ఉద్యోగి భాగం అయ్యారు. వయనాడ్‌లో విపత్తు సంభవించిన ప్రాంతాన్ని ఆరు జోన్లుగా విభజించి, 40 బృందాలు గాలింపుచర్యలు చేపడుతున్నాయి. స్థానిక పోలీసులు, ఈతలో నిష్ణాతులైన స్థానికులు ఈ సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. హెలికాప్టర్‌ను ఉపయోగించనున్నారు. శనివారం ఢిల్లీకి చెందిన డ్రోన్ ఆధారిత రాడార్ గాలింపు చర్యల్లో పాల్గొననుంది. మరోపక్క 25 అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు. వయనాడ్ మాజీ ఎంపీ రాహుల్ గాంధీ అయిన ఆయన తన సోదరి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీతో కలిసి గురువారం కొండ చరియలు విరిగిపడిన చూరాల్‌మలలో పర్యటించారు. వారు ఈ రోజు కూడా అక్కడే ఉండి ఇతర ప్రభావిత ప్రాంతాలకు వెళ్లనున్నారు. ఈ దుర్ఘటనను జాతీయ విపత్తని రాహుల్ అభివర్ణించారు. వెంటనే సమగ్ర



కార్యాచరణ ప్రణాళికతో పునర్నిర్మాణం చేపట్టాలని కేంద్రాన్ని డిమాండు చేశారు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811

# తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భూమి పూజలో మంత్రి శ్రీధర్ బాబు...

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' బిల్లును అసెంబ్లీలో గురువారం మంత్రి శ్రీధర్ బాబు ప్రవేశపెట్టారు. అతి త్వరలో జాబ్ క్యాలెండర్ ప్రకటన చేస్తామని ఆయన తెలిపారు. జాబ్ క్యాలెండర్ ద్వారా రాబోయే రోజుల్లో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మంత్రి వెల్లడించారు. 2 లక్షల ఉద్యోగాలు కల్పించినా... మరో 20 లక్షల మంది ఉపాధి కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా అందరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు గ్యాడ్యుయేట్లలో కొరవడ్డాయని తెలిపారు. నైపుణ్యాల పెంపుపై పారిశ్రామికవేత్తలు,



వీసీలు, విద్యార్థులతో చర్చించామన్నారు. నైపుణ్యాల పెంపొందించే ఉద్యేశంతోనే యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ స్థాపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అన్ని కోర్సులు 50 శాతం ప్రాక్టికల్ కాంపొనెంట్ ను కలిగి ఉంటాయన్నారు. నైపుణ్యాలు, ఉపాధి అంతరాల పరిష్కారం కోసం ప్రత్యేక సంస్థ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నట్లు మంత్రి సూచించారు. స్కిల్ యూనివర్సిటీ ఉపాధి కల్పిస్తుంది.. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని పెంచుతోందన్నారు. తెలంగాణలో మరిన్ని పరిశ్రమల స్థాపనకు ఊతమిస్తుందన్నారు.కందుకూరు మండలం మీర్ ఖాన్ పేటలో గురువారం సాయంత్రం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తెలంగాణాకు శంకుస్థాపన చేస్తున్న ఐటీ పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు. 57 ఎకారాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతుంది.

---

# అసెంబ్లీ ఆవరణంలోని సోషల్ మీడియా పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు: మంత్రి

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** శాసనసభ ప్రత్యక్ష ప్రసారాల్లోని దృశ్యాలను మార్ఫింగ్ చేసి సహచర మంత్రి సీతక్క గౌరవానికి భంగం కలిగించేలా సోషల్ మీడియా పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు విజ్ఞప్తి చేసారు. శాసనసభ గౌరవాన్ని దిగజార్చే చర్యలను సహించబోమని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. 'తెలంగాణా సివిల్ కోర్టుల సవరణ బిల్లు-2024' పై పలువురు సభ్యులు వ్యక్తం చేసిన అభిప్రాయాలకు శ్రీధర్ బాబు సమాధానమిచ్చారు. హైకోర్టు నిర్మాణానికి ప్రభుత్వం బడ్జెట్ లో రూ.1,000 కోట్లు కేటాయించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసారు. రాజేంద్ర నగర్ లో వంద ఎకరాల్లో నిర్మించే ఉన్నత న్యాయస్థాయన భవనాలు రాష్ట్రం గర్వపడేలా ఉంటాయని ఆయన తెలిపారు. వ్యవసాయ వర్సిటీ భూమిని హైకోర్టు నిర్మాణానికి తీసుకోవడం వల్ల పరిశోధనలకు ఆటంకం కలగదని స్పష్టం చేసారు. వ్యవసాయ పరిశోధనల కోసం మరో చోట రెట్టింపు భూమి ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. జిల్లా కోర్టులకు నూతన భవనాలు, మౌలిక వసతుల కల్పనపై తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇటీవల కేంద్రం రూపొందించిన పలు చట్టాలను యదాతథంగా అమలు చేసే ఉద్దేశం రాష్ట్రానికి లేదని శ్రీధర్ బాబు ప్రకటించారు. న్యాయశాఖ వాటిని పరిశీలిస్తోందని తెలిపారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, పౌర హక్కులకు భంగం కలిగించేలా కేంద్ర చట్టాలు ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. గత పదేళ్లలో తాము కూడా నిరసనలు తెలపడానికి అనేక ఇబ్బందులు పడిన విషయాన్ని మంత్రి గుర్తు చేసారు. పార్టీ పరంగా ఎప్పుడైనా ధర్నా నిర్వహించాలనుకుంటే అప్పటి ప్రభుత్వం ముందు రోజు రాత్రే గృహ నిర్భందం చేసేదని తెలిపారు. తమ ప్రభుత్వంలో హెూం శాఖను ముఖ్యమంత్రి నిర్వహిస్తున్నారని, పోలీసు విధుల్లో ఎన్నడూ జోక్యం చేసుకోలేదని అన్నారు. ఎక్కడైనా పోలీసులు అతిగా స్పందించినట్టు తమ దృష్టికి తెస్తే విచారణ జరిపిస్తామని తెలిపారు. అదే సమయంలో శాంత్రి భద్రతలకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రతిష్ఠకు భంగం కలిగించే శక్తులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. సైబర్ నేరాలను అరికట్టడానికి అవసరమైతే కొత్త




చట్టాలు తీసుకొస్తామని, అమాయకులెవరూ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి నష్టపడకుండా చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కోర్టుల్లో ప్రస్తుతం 8,91,598 కేసులు పెండింగులో ఉన్నాయని వెల్లడించారు. సిబ్బంది కొరతే ప్రధాన సమస్య అయితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి సీతక్కపై మార్ఫింగ్ వీడియోలు సృష్టించి సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేసిన ఘటనపై శ్రీధర్ బాబు చేసిన అభ్యర్ధనకు స్పీకర్ స్పందించి దర్యాప్తునకు ఆదేశించారు.

---

# పరిశీలనలో తెలుగు వర్సిటీకి సురవరం పేరు: రేవంత్

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప రెడ్డి పేరును పరిశీలిస్తున్నట్లు నేడు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందరూ సహకరిస్తే సురవరం ప్రతాప రెడ్డి పేరు పెడదామని ఆయన సభ్యులను కోరారు.సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ ప్రతిపాదనపై కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. సురవరం ప్రతాప రెడ్డి గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ ఆలోచన చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కూనంనేని చెప్పారు. సురవరం ప్రతాప రెడ్డి పేరు అందరూ ఆమోదించాలని సభలోని సభ్యులకు ఆయన పిలుపునిచ్చారు.

**వైతాళికుడు సురవరం ...** తన బహువిధ రచనా ప్రక్రియల ద్వారా, నిద్రావస్థలో ఉన్న తెలుగు జాతిని జాగృతం చేసిన వైతాళికుల్లో సురవరం ప్రతాపరెడ్డి ఎన్నదగినవారు. 1896 మే 28న ఉమ్మడి మహబూబ్నగర్జిల్లా అలంపూర్తాలూకా బోరువెల్లి గ్రామంలో జన్మించిన ఆయన.. గోల్కొండ పత్రిక సంపాదకులుగా, సమాజ సేవకుడిగా, బహుగ్రంథకర్తగా, భాషా పరిశోధనల ద్వారా ఆంధ్రుల సంస్కృతిని పరివ్యాపితం చేసిన ప్రయోక్తగా తెలుగుజాతికి చిరపరిచితులు. కానీ, అనేక కారణాల వల్ల ఆయనకు నిజంగా రావాల్సినంత ఖ్యాతి దక్కలేదేమో అనిపిస్తుంది. అందుకు, స్వతస్సిద్ధమైన ఆయన స్వభావం కూడా కొంతవరకు కారణమై ఉండొచ్చు.బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆయన ప్రచారం కోసం అర్రులు చాచింది ఎప్పుడూ లేదు. సాధికారికంగా ఆయన చెప్పే ప్రతి అంశంలోనూ నిశిత పరిశీలనా పరిశోధనా దృష్టి, లోతైన విషయ పరిపక్వత వాటన్నింటికీ మించిన మానవీయత నిజాయతీ తొణికిసలాడుతుంటాయి. ప్రచార కండూతి ఏ కోశానా కనిపించదు. కారణం ఏదైనా, సురవరం ప్రతాపరెడ్డికి అర్హమైన హేతుబద్ధమైన స్థానం కల్పించకపోవడం వల్ల ఆయన నష్టపోయినదానికన్నా తెలుగు జాతి నష్టపోయిందే



ఎక్కువ. రాజకీయ, సాహిత్య, సంగీతాదిరంగాల్లో తెలుగునాట లబ్ధప్రతిష్టులైన 75 మంది నాటి ప్రముఖ 'పెన్పోర్ట్రెయిట్స్'ను 1959-61లలో ఆంధ్ర సచిత్ర వార పత్రికల్లో ధారావాహికంగా ప్రచురించారు. అందులో సురవరం ప్రతాపరెడ్డి వంటి బహుముఖ ప్రజ్ఞాశాలికి చోటుదక్కకపోవడం విచిత్రం.

---

# ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే సమస్యలను పరిష్కరించాలి

**- సచివాలయం వద్ద అనాధల అధ్యక్షుడు వెంకటయ్య నిరసన**

**తెలంగాణ వీణ/హైదరాబాద్, ఆగస్ట్ 02:** రాష్ట్రంలో అనాధలకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన పెండింగ్ ఫైల్స్ తోపాటు కొత్తగా డిమాండ్లని ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే నెరవేర్చాలని తెలంగాణ అనాధ హక్కుల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బొక్క వెంకటయ్య శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్బంగా వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అనాథల హక్కులకు, వారి ప్రాణాలకు, వారి వంశపరంగా వచ్చిన, వారి సమస్యలపైన తాను దాదాపు 2000 సం. నుండి శాంతియుతంగా ఉద్యమాలు చేసి అనేక జీవోలను ప్రభుత్వం ద్వారా తీయించి వారికి రక్షణ కల్పిస్తున్నానన్నారు. గత సీఎం కెసిఆర్ తేది. 24.06.2015 సం.లో ఒక సబ్ కమిటి వేసి ఈరోజు, రేపు అంటూ అనేక మీటింగ్స్ పెట్టి దేశంలోనే ఎక్కడ లేని విధంగా ప్రత్యేక బడ్జెట్, ప్రత్యేక స్కూల్లు, ప్రత్యేక కాలేజిలు, ప్రత్యేక క్యాంపస్ లు ఏర్పాటు చేస్తామని చెప్పి దాదాపు 9 సం.లు ఏమీ చేయలేదన్నారు. చాలాచోట్ల అనాథల్ని మర్డర్లు, మానభంగాలు చేయడమేగాక వారికి వంశ పారంపర్యంగా వచ్చిన ఆస్తులను దక్కనీయకుండా కబ్జాలు చేస్తూ, వారి భూమి వద్దకు పోతే కొట్టి, తప్పుడు కేసులు పెట్టి రిమాండ్ చేస్తున్నాని ఆవేదన వ్యక్తం చేశారు.




# గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం: డి.ఎం. అండ్ హెచ్ఓ ప్రమోద్



**తెలంగాణ వీణ/హైదరాబాద్, ఆగస్ట్ 02:** గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్ అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం-1994 పరిధి జిల్లా అడ్వైజరి కమిటి సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సంధర్బంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, మన పెద్దపల్లి జిల్లాలో మొత్తం 31 స్కానింగ్ కేంద్రాలు రిజిస్టర్ అయ్యాయని, జిల్లాలో జరిగే ప్రతి స్కానింగ్ కు సంబంధించి ఫారం ఎఫ్ రూపొందించి ఆన్ లైన్ లో నమోదు చేయాల్సి ఉంటుందని అన్నారు.పెద్దపల్లి జిల్లాలో జరిగే ప్రసవాలలో వెయ్యి మంది మగ పిల్లలకు 924 మంది ఆడ పిల్లలు జన్మిస్తున్నారని, గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు!

---

## డివిజన్లో సమస్యలు పరిష్కారం కోసం కృషి: కార్పొరేటర్ రాజ్యలక్ష్మి



**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** డివిజన్లో ప్రతి కాలనీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని వినాయక నగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తెలిపారు.శుక్రవారం వినయక్ నగర్ డివిజన్ పరిధిలోని శివ నగర్ ఫేస్ 2 లో గత కొంత కాలంగా రోడ్ కోసం కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేటర్ రోడ్ శాంక్షన్ చేపించి రోడ్ వేయించారు. AE సత్యలక్ష్మి గతో కలసి కార్పొరేటర్ రాజ్యలక్ష్మి కాలనీ లో పర్యటించి, పలు సమస్యలు కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరలో పనులు పూర్తిచేస్తామని కానీ అసలు తెలిపారు .. ఈ కార్యక్రమం లో కాలనీ వాసులు కృష్ణ స్వామి,మల్లేష్, ఓం ప్రకాష్, సాయి సురేష్, పాల్గొన్నారు.

## తెలంగాణ అసెంబ్లీలో ప్రజాస్వామ్యబద్ధంగా చర్చ జరగాలి



**తెలంగాణ వీణ/సిద్దిపేట జిల్లా:** సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రజాస్వామ్యబద్ధంగా రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని పార్టీల ఎమ్మెల్యేలు ప్రజలతో ఎన్నుకోబడ్డారు కనుక అన్ని పార్టీల ఎమ్మెల్యేల మద్దతుతో అందరితోని బడ్జెట్ సమావేశాలు జరపాలి కానీ కానీ ప్రజల సమస్యలను ప్రశ్నించకుండా బి.ఆర్.ఎస్. పార్టీ ఎమ్మెల్యే లను పోలీసు రాజ్యంతో ప్రశ్నించకుండా అరెస్టు చేయడం హేయమైన చర్య గ భావిస్తున్నాము. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రజలందరూ శాసనసభలో జరిగినటువంటి విషయాలపై ప్రశ్నించే గొంతుకులను అరెస్టు చేయడం కే పి ఆర్ సేన దుబ్బాక నియోజకవర్గం అధ్యక్షులు తుక్కయ్య గారి బాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.

## ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీమ్ కోర్టు తీర్పు ఇవ్వడంతో నాచారంలో సంబరాలు



**తెలంగాణ వీణ/నాచారం:** ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కోరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో 30 సంవత్సరాల ఏబిసిడి వర్గీకరణ న్యాయమైనదేనని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది దానికి గాను నాచారం అంబేద్కర్ విగ్రహానికి కి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌడవెల్లి రామకృష్ణ మాదిగ, మల్లెల నర్సింగరావు మాల, ఏర్పుల నర్సింగరావు మాదిగ, హరిబాబు మాదిగ,పొన్నాల మహేందర్ మాదిగ, ఆకస్వామీ మాదిగ, కొమ్మ గళ్ళ నవీన్ కుమార్ మాదిగ, నాగరాజు మాదిగ, ఐలాండ్ మహేష్ మాదిగ, పల్లేరుల నరేష్ మాదిగ, బొడ్డు శివ మాదిగ, దండమల్ల గోపి మాదిగ, శ్రీకాంత్ మాదిగ, బాబు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు వచ్చిన ఇబ్బందేమీ లేదు: పొన్నం ప్రభాకర్..



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు వచ్చిన ఇబ్బందేమీ లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనసభలో సివిల్ కోర్టుల సవరణ బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. సివిల్ కోర్టుల సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా కెటిఆర్‌కు పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చా రు. సామాజిక మాధ్యమాల్లో కొందరు అతిగా ప్రవర్తిస్తు న్నార ని, మహిళా మంత్రిపైనా వ్యక్తిగత విమర్శలు చేయడం సరికా దన్నారు. ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణంపై ఫేక్ వీడియోలు పెడుతున్నారని, సభా కార్యక్రమాలపై ఫేక్ వీడియోలు పెట్టినవారిపై చర్యలు తీసుకుంటామని పొన్నం హెచ్చరించారు.

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేల్చడం..

జనరల్

శనివారం 03 ఆగస్టు 2024

## భద్రతకు సిసి కెమెరాలు ముఖ్యం: మాజీ బోర్డ్ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్



**తెలంగాణ వీణ/కంటోన్మెంట్:** కంటోన్మెంట్ ఒకటో వార్డులోని జయనగర్ నల్ల పోచమ్మ దేవాలయంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ప్రారంభించారు. బోయిన్ పల్లి యాదవ సంఘం,కాంగ్రెస్ నేత అరుణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సి సి కెమెరాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. హుండీ లో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో అలాంటి సంఘటనలకు ఆస్కారం లేకుండా ఉండాలంటే సిసి కెమెరా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వీటిని అందించిన అరుణ్ యాదవ్ కు జంపన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభు గౌడ్, టీంకు గౌడ్, అనిల్,శశి,జ్ఞన్ ప్రకాష్, అశోక్,సులేమాన్,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికరాలు సురేఖకి రావలసిన గ్రాడ్యుయేట్ ఇప్పించిన బిఆర్టీయు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్...



**తెలంగాణ వీణ/జీడిమెట్ల:** కుత్బుల్లాపూర్ జీడిమెట్ల ఇండస్ట్రీ ఏరియాలో "శ్రీ సత్య సాయి ఫాలీ ప్యాక్ షెడ్ నెంబర్ డీ–35, ఫేస్–4" కంపెనీలో సురేఖ అనే కార్మికురాలు గత కొన్ని సంవత్సరాల నుంచి పనిచేసేవారు, అనువార్య కారణాలవల్ల, కంపెనీ యజమాన్యం కార్మికరాలు సురేఖని తీసివేయడం జరిగింది... సురేఖ అనే కార్మికరాలకి గ్రాడ్యుయేట్ రూపాయలు రావాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని అడిగి అడిగి విసుగు చెందిన కార్మికురాలు తమకు తెలిసిన కార్మిక మిత్రుల ద్వారా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని తన ఆఫీస్ వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు..వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్ హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ యజమాన్యంతో చర్చించి కార్మికురాలు సురేఖ కి రావలసిన గ్రాడ్యుయేట్ డబ్బులు ఇప్పించారు... కార్మికురాలు సురేఖ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు..ఈ కార్యక్రమంలో అనిల్,సుదర్శన్,జగన్,కిరణ్,తదితరులు పాల్గొన్నారు..

## తల్లి కొడుకు అదృశ్యం...

**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** ఇంటి నుండి బయటకు వెళ్లిన తల్లి కొడుకు అదృశ్యమైన సంఘటన నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది వివరాలు ఇలా ఉన్నాయి.. నేరేడ్మెట్ చంద్రబాబు నాయుడు కాలనీలో నివసించే ఏ కేతావత్ శివ, కేతావత్ అంజలి, భార్యాభర్తలు వీరికి మూడు సంవత్సరాలు కుమారుడు, ఈనెల రెండో తారీఖున మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి తల్లి కొడుకు వెళ్లారు, తిరిగి మళ్లీ రాలేదు, గతంలో నాలుగు సార్లు నేరేడ్మిట్ పోలీస్ స్టేషన్ మిస్సింగ్ కేసు నమోదు అయింది. బంధువుల ఇళ్లలోనూ ,స్నేహితులలో ఇళ్లలోనూ వెతికిన లేకపోవడంతో ఆమె భర్త శివ నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్ చేస్తున్నట్లు సీఐ సందీప్ కుమార్ తెలిపారు.



# ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్న బిజెపి..

**- వర్గీకరణ కాదని చెప్పిన కోర్టు అనుకూలంగా తీర్పు ఎలా... - తీర్పును పునః సమీక్షించాలి**

**- తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ..**



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :**ఎస్సీ వర్గీకరణ అంశంపై 2004లో సుప్రీంకోర్టు ఎందుకు కొట్టివేసి ఇప్పుడు ఎందుకు తీర్పు ఇచ్చిందని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ప్రశ్నించింది. బిజెపి ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణ అంశంపై మోడీ వెంకయ్య నాయుడు చంద్రబాబు నాయుడు కిషన్ రెడ్డి హస్తం ఉందని ఆరోపించింది. శుక్రవారం లోయర్ ట్యాంక్ బండ్ లోని అంబేద్కర్ భవన్లో జేఏసీ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జెఎసి చైర్మన్ చెరుకు రామచందర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఈ తీర్పును పునః సమీక్షించాలని కోరారు. రాజ్యాంగానికి విరుద్ధంగా నిర్ణయాలు సరికాదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అసంతృప్తిని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.సుప్రీంకోర్టులో ఈ అంశంపై రివ్యూ పిటిషన్ వేస్తామన్నారు. అంతేకాకుండా 29 రాష్ట్రాల నుంచి తీర్మానాలు పార్లమెంటు ఆమోదం లేకుండా వర్గీకరణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇదంతా కేంద్రంలోని బిజెపి పాలకుల కుట్ర అని విభజన రాజకీయం చేస్తున్న వారికి తగిన గుణపాఠం తప్పదన్నారు. జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు పెంచకుండా దళితుల మధ్య తగవులు పెడతారా అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఉన్న షెడ్యూల్ కులాలను అభివృద్ధి చేయకుండా రాజకీయ పార్టీలు కలిసి విడగొడుతున్నాయని విమర్శించారు. ఏదైనా శాస్త్రీయ బద్ధంగా జరగాలి తప్ప కుట్రలతో కాదని, తీర్పులో ఏ అంశాలు ఉన్నాయో తెలియకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తామని అనడం సరికాదన్నారు. వర్గీకరణ జరగకుండా ఉండేందుకు మాల ప్రజాప్రతినిధులు అంతా తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఢిల్లీ వేదికగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ ప్రతినిధులు మంత్రి నరసింహయ్య, బీర బాలకృష్ణ, గడ్డం సత్యనారాయణ, నాను, అనిల్, నర్మేట మల్లేష్, భాస్కర్, పాలడుగు శ్రీనివాస్, నర్సింగ్ రావు, లలిత, అనురాధ, ప్రశాంత్ లతో పాటు వివిధ జిల్లా జేఏసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

**- జగిత్యాల రూరల్ అంగన్వాడీ సూపర్వైజర్ జుంబర్తి లావణ్య**



**తెలంగాణ వీణ/జగిత్యాల:** పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు అమృతం తో సమానం బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు పట్టించే ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకా వంటివని జగిత్యాల రూరల్ మండలం అంగన్వాడీ సూపర్వైజర్ జుంబర్తి లావణ్య అన్నారు. శుక్రవారం రోజున జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ పీహెచ్ సీ పరిధిలోని చల్ గల్ అంగన్వాడీ కేంద్రం(1)లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ నరేష్ ఆదేశానుసారం జగిత్యాల రూరల్ మండల అంగన్వాడీ సూపర్వైజర్ లావణ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని లావణ్య తెలిపారు.ఈసందర్బంగా లావణ్య మాట్లాడుతూ ముర్రుపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతోపాటు శారీరిక ,మానసిక వికాసానికి తోడ్పడుతాయని ఆమె చెప్పారు .తల్లిపాలలో బిడ్డకు కావాల్సిన నీరు ,పోషక పదార్థాలు ఉంటాయి కాబట్టి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే బిడ్డకు ఆహారంగా పట్టించాలని ఏడవ నెల నుండి బిడ్డకు అనుబంధ అనుబంధ ఆహారాన్ని తగిన పోషక విలువలతో తగిన పరిమాణంలో తినిపిస్తూ రెండు సంవత్సరాల వరకు కూడా తల్లిపాలు కొనసాగించాలని ఇలా చేయడం ద్వారా తల్లికి కూడా ఆరోగ్యరీత్యా మేలు జరుగుతుందని తెలిపారు.తదనంతరం గర్భిణీలు బాలింతలు తీసుకోవలసిన పోషకాహారం గురించి ఆరోగ్యపరమైన జాగ్రత్తల గూర్చి వివరించారు.అంగన్వాడీ కేంద్రం లో ఆరోగ్య లక్ష్మి కార్యక్రమం ద్వారా అందించే భోజనాన్ని గర్భిణీ బాలింతలు తప్పనిసరిగా కేంద్రంలో భుజించి వెళ్లాలని ఇది ఏ రోజుకి ఆ రోజు తల్లికి, బిడ్డకు ఒక ఔషధంలా పనిచేస్తుందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో చల్ గల్ సెక్రటరీ శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్ సుజాత, హెల్త్ స్టాఫ్ షామిని, సమ్రీన్ సుల్తానా, జయప్రద, సఖి కేంద్రం నుండి శారద ,గౌతమి, ఆశా కార్యకర్తలు అంగన్వాడీ టీచర్స్ సమ్మక్క,ఖలీదా బేగం, జయశీల, ఉమారాణి ,లక్ష్మి మరియు అంగన్వాడి ఆయాలు గర్భిణీలు, బాలింతలు ,రెండు సంవత్సరాలలోపు పిల్లల తల్లులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# త్వరలో సమగ్ర క్రీడా పాలసీ

**- క్రీడాకారులను ప్రోత్సహించేలా చర్యలు**

**- స్కిల్ వర్సిటీ వద్దే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం**

**- బిసిసి ఆధ్వర్యంలో నిర్మించేలా భూ కేటాయింపులు**

**- ఉన్న స్టేడియాలను కూడా ఉపయోగించుకుంటాం**

**- నిఖిత్ జరీన్, సిరాజ్‌కు ప్రభుత్వ ఉద్యోగాలు**

**- బడ్జెట్‌లో స్పోర్ట్స్ కోసం రూ. 361 కోట్లు కేటాయించాం - అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన**



**తెలంగాణ వీణ/హైదరాబాద్,ఆగస్ట్2:** తెలంగాణలో సమగ్ర స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. పిల్లలను క్రీడాకారులుగా తీర్చిదిద్దేలా చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. మాదక ద్రవ్యాలకు వారిని దూరం చేసేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు. కందుకూరు మండల పరిధిలోని బేగరికంచలో అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. పిల్లలను పుస్తకాలకు పరిమితం చేసి క్రీడలకు దూరం చేస్తున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మా ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి స్పోర్ట్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆలోచన చేస్తూ వివిధ సందర్భాల్లో నేను ప్రస్తావించాను. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో గచ్చిబౌలి స్టేడియంలో వివిధ రకాల క్రీడలు నిర్వహించాం. వివిధ కారణాల చేత గేమ్స్ నిర్లక్ష్యానికి గురయ్యాయి. పుల్లెల గోపీచంద్ అకాడమీకి ల్యాండ్ ఇచ్చాం. ఆ అకాడమీ నుంచి చాలా మంది క్రీడాకరులు తయారయ్యారు. ప్రయివేటు అకాడమీలు కాకుండా ప్రభుత్వం తరపున శిక్షణ ఇస్తే అద్భుతంగా రాణించడానికి అవకాశం ఉంటుంది.. అందుకే ప్రత్యేకంగా ఈ బడ్జెట్‌లో స్పోర్ట్స్ కోసం రూ. 361 కోట్లు కేటాయించాం అని రేవంత్ రెడ్డి తెలిపారు. పిల్లలను పెద్ద పెద్ద చదవులు చదివించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వారిని పుస్తకాలకే పరిమితం చేసి క్రీడలకు దూరం చేస్తున్నారు. ఆటల్లో కూడా రాణిస్తే ఉద్యోగాలు వస్తాయి.. ఉపాధి దొరుకుతుంది.. ఆ కుటుంబానికి గౌరవం కూడా లభిస్తుంది. ఈ విషయం ప్రపంచానికి తెలియజేసేందుకే నిఖత్ జరీన్‌కు, సిరాజ్‌కు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాం. ఇండ్లు కట్టుకునేందుకు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో 600 గజాల చొప్పున స్థలం కేటాయించాం అని సీఎం పేర్కొన్నారు. చదవు కంటే కూడా క్రీడల్లో రాణిస్తే తప్పకుండా ఉద్యోగ భద్రత ఉంటుంది. ఇంటర్ పాసైన సిరాజ్‌కు విద్యార్హతలో మినహాయింపు ఇచ్చి ఉద్యోగం ఇచ్చాం. తెలంగాణ రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తాం. వివిధ రాష్టాల్లో స్టడీ చేసి సమాచారం సేకరించాం. హర్యానా రాష్ట్రంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నారు. కాబట్టి హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను అనుసరించాలని నిర్ణయించాం. వచ్చే సమావేశాల్లో స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తాం అని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రతి మండల కేంద్రంలో ఒక మినీ స్పోర్ట్స్ స్టేడియంను నిర్మిస్తాం. రాష్ట్రంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీసీసీఐతో మాట్లాడుతున్నాం.. ప్రాథమిక చర్యలు పూర్తయ్యాయి. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రాంతానికి న్యాక్‌ను షిఫ్ట్ చేస్తాం. బేగరికంచెలో అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియంను నిర్మించడానికి భూమి కేటాయిస్తాం. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీసీసీఐ వారు ముందుకు వచ్చారు. ఈ స్పోర్ట్స్ విషయంలో నిధుల కేటాయింపుతో పాటు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం. ఈ రాష్ట్రంలో యువతను వ్యసనాల నుంచి బయటకు తీసుకురావలంటే స్పోర్ట్స్‌ను ప్రోత్సహించాలి. స్పోర్ట్స్ పాలసీకి సంబంధించి సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తాం. కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి, సరూర్ నగర్, ఎల్‌బీ స్టేడియంలు రాజకీయ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ప్రపంచంలో మన పిల్లలు పతకాలు సాధించే విధంగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.నగరంలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బేగరికంచలోని స్కిల్ యూనివర్సిటీకి సమీపంలో ఈ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనిపై బీసీసీఐతో ప్రాథమిక చర్చలు పూర్తిచేశామన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. త్వరలో స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరు తమ సలహాలు ఇవ్వాలని అన్నారు. వ్యసనాల నుంచి యువతను బయటకు తీసుకురావాలంటే క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందన్నారు. వచ్చే సమావేశాల్లో క్రీడలకు సంబంధించిన పాలసీ తీసుకొస్తామని.. దీనికి సంబంధించి ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామని తెలిపారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దీనికి అందరూ సహకరించాలని సీఎం కోరారు.

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం...
జనరల్
శనివారం 03 ఆగస్టు 2024

# చేర్యాల ప్రైవేట్ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించి స్కూల్ టీచర్లకు కనీస వేతనాలు అందించాలి

**- సిపిఎం పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు డిమాండ్**

**తెలంగాణ వీణ/సిద్దిపేట జిల్లా:** సిద్దిపేట జిల్లా చేర్యాలపట్టణంలో సిపిఎం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది ఈ సందర్భంగా రాళ్ల బండి నాగరాజు పాల్గొని మాట్లాడుతూ చేర్యాల పట్టణంలో ఉన్నటువంటి ప్రైవేట్ స్కూళ్లలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండా కనీసం పార్కింగ్ లేకుండా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని కొన్ని రూట్లో బస్సులు ఫిట్నెస్ లేకుండా నడుపుతున్నారని వాటి పట్ల విద్యాశాఖ ఆర్టీవో అధికారులు చర్యలు తీసుకోవాలన డిమాండ్ చేశారు అలాగే ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే టీచర్లు పీఈటీలు అందించే వేత నాలు చాలా తక్కువగా ఉన్నాయని ప్రభుత్వం చెప్పినట్టుగా కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రైవేట్ యాజమాన్యాలు నిర్లక్ష్యం



వహిస్తున్నారని చాలీచాలని జీతాలు ఇస్తూ వారితోటి వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాలలో కూడా రెండవ శనివారాలలో కూడా పెండింగ్ వర్క్ ఉందంటూ టీచర్ల తోటి పెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని పనికి తగ్గట్టుగా వేతనాలు చెల్లించాలని అలాకాకుండా చాలీచాలని వేతనాలు ఇస్తూ టీచర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సెలవు దినాలు లేకుండా చేస్తున్నారని వారు ఆరోపించారు ప్రభుత్వ రూల్స్ ప్రకారంగా జీతాలు చెల్లించాలని మరొకసారి గవర్నమెంట్ హాలిడేలలో స్కూల్స్ నిర్వహిస్తే పాఠశాల ముందు ధర్నా నిర్వహిస్తామని దీనికి ప్రజా సంఘాలు విద్యార్థి సంఘాలను కలుపుకొని ముందుకు పోదామని వారు హెచ్చరించారు ఈ సమావేశంలో సిపిఎం నాయకులు ఇప్ప కాయల శోభ పోలోజు శ్రీహరి దర్శనం రమేష్ బోయిన మల్లేశం రాళ్ల బడి చందు ఆముదాల రంజిత్ రెడ్డి ఎర్ర బూస్ అశోక్ తదితరులు పాల్గొన్నారు

---

## అనారోగ్యంతో మరణించిన దుబాసి అరుణ కుటుంబానికి ఆర్థిక సహాయం



**తెలంగాణ వీణ/సిద్దిపేట జిల్లా:** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల్ గ్రామం పాములపర్తి దుబ్బాసి అరుణ కుటుంబా సభ్యులను గ్రామ మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి ఆర్థిక సహాయం చేసి పరమార్శించడం జరిగింది మండల్ అధ్యక్షుడు కనకయ్య గౌడ్,ఉప్పసర్పంచ్ పద్మనార్సింలు క్రాంతి కుమార్, కిషన్ ,లక్ష్మణ్,మాలయ్య , నాగరాజు, యాదయ్య, నర్సింలు, ప్రశాంత్, మలేష్,చెవిటిదని మలేష్, ఇతరులు పాల్గొన్నారు.

## పాతూర్ గ్రామంలో ఘనంగా పీర్ల ఊరేగింపు



**తెలంగాణ వీణ/సిద్దిపేట జిల్లా:**సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం పాతూరు గ్రామంలో శుక్రవారం మతాలక తీతంగా పీర్ల పండుగ జరిగింది. గ్రామంలోని పలు వీధులలో డప్పు చప్పులతో యువకులు నృత్యాల మధ్య పీర్లను ఘనంగా ఊరేగించారు ఈ ఊరేగింపులో పిల్లలు పెద్దలు మహిళలు సైతం పాల్గొన్నారు పీర్ల ఊరికింపుతో గ్రామంలో పండుగ వాతావరణాన్ని తలపించింది గ్రామంలోని వీధులకు పీరీలు చేరగానే వాటిని దర్శించుకున్న పలువురు సంప్రదాయ బద్దంగా దట్టీలు కట్టి ఊదు బెల్లం కానుక లుగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు హల్వా ఆటలు గ్రామ పెద్దలు యువకులు యువత పెద్ద ఎత్తున పాల్గొని పండుగ సంబరంగా చేసుకున్నారు

## ముదిరాజ్ సంగం కమ్యూనిటీ హాల్ కొరకు భూమి పరిశీలన



**తెలంగాణ వీణ/సిద్దిపేట జిల్లా :** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల్ పాములపర్తి గ్రామంలో శుక్రవారం బావుల కాడ ముదిరాజుల సమక్షంలో నూతన కమ్యూనిటీ హాల్ భవనం కోసం భూమి పరిశీలన చేయడం జరిగింది.మర్కుక్ మండల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాండ కనకయ్య గౌడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు క్రాంతి కుమార్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి బాలకృష్ణ తాజా మాజీ ఉపసర్పంచ్ పద్మ నర్సింలు మంగి కిషన్ శ్రీగిరిపల్లి నాగరాజు లక్ష్మణ్ మహేష్ శ్రీగిరి పల్లి మల్లేష్ లెంకల అశోక్ , చెక్కల బాల్నర్సు ,కిష్టయ్య, యాదగిరి చెవిటిదాని మల్లేష్ కొండని నవీన్ కొండని ప్రశాంత్ తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## యువత స్వయం ఉపాధి రంగాల్లో రణించాలి...

**- మాజీ ఎంపీపీ పాండు గౌడ్,మాజీ సర్పంచ్ నర్సింలు**

**తెలంగాణ వీణ/సిద్దిపేట జిల్లా:**సిద్దిపేట జిల్లా వర్గల్ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ సమయాన్ని వృథా చేసుకొంకుండా స్వయం ఉపాధి రంగాలపై దృష్టి పెట్టాలని మార్కుక్ మండల మాజీ ఎంపీపీ పాండు గౌడ్,పాతూర్ గ్రామ మాజీ సర్పంచ్ నర్సింలు పేర్కొన్నారు. వర్గల్ మండలం లోని గౌరారం రాజీవ రహదారి పక్కన కొండపాక కృష్ణ , నర్సింలు ఏర్పాటు చేసుకున్న" ఇలాక హెూటల్ " ను శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతీయువకులు స్వయం ఉపాధి వైపు దృష్టి సాధించాలని నచ్చిన రంగాన్ని ఎంచుకుని ఆర్థికంగా రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామచంద్రం. నర్సింలు, వేణు,రాజు, నర్సింలు, కనకయ్య, స్వామి, బాబు, నర్సింలు, స్వామి, భాను,మల్లేశం, ముత్తయ్య, నర్సింలు,యాదగిరి, నర్సింలు,పాల్గొన్నారు.



## ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: ఓయూ అధ్యాపకులు..




**తెలంగాణ వీణ/ఓయూ:**ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ను ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులుగా స్వాగతిస్తున్నామని ఓయూ మాదిగ అధ్యాపకులు తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సామాజిక న్యాయం నెరవేర్చడం కోసం వచ్చిన తీర్పు అని అన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో మాదిగ అధ్యాపకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ నిబద్ధతతో పని చేస్తే తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతో మంది ఉద్యమించారని వారందరికీ ఓయూ అధ్యాపకుల తరపున కృజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పీజీ ప్రవేశ పరీక్షల ఫలితాలు త్వరలో విడుదలకానున్న నేపథ్యంలో వర్గీకరణ పట్ల కోర్టు తీర్పు ప్రకారం సీట్లను భర్తీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. గ్రూప్ వన్ ఇంటర్వ్యూ లో కూడా రిజర్వేషన్లను పాటించాలని ప్రభుత్వాన్ని కోరారు. అవసరమైతే గవర్నర్ ద్వారా అర్డినేన్స్ తెస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వెంటనే ఆర్డినెన్సు తీసుకొనివచ్చి రిజర్వేషన్ ప్రక్రియ చేపట్టాలని కోరారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

**తెలంగాణ వీణ/పరకాల, ఆగస్టు 2:**క్రీడలు ఆత్మ స్థైర్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, తద్వారా విధులు సక్ర మంగా నిర్వర్తించవచ్చని పరకాల డిపో మేనేజర్ రవిచందర్ తెలిపారు. శుక్రవారం పరకాల డిపోలో లక్ష్మే లక్ష్యంలో భాగంగా షటిల్, వాలీబాల్, చెస్, క్యారం, టెన్ని కాయిట్ ఆయా విభాగాల్లో నిర్వహించిన క్రీడల్లో గెలిచిన విజేతలకు డిపో మేనేజర్ రవిచందర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు. అసిస్టెంట్ మేనేజర్ కృష్ణకుమారి, అసిస్టెంట్ ఇంజనీర్ రాజశ్రీ పాల్గొన్నారు.




## నాలా పూడిక తీత పనులు పరిశీలన: కార్పొరేటర్ సునీత యాదవ్

**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** డివిజన్‌లోని ప్రతి కాలనీ అభివృద్ధి చేయడం తమ లక్ష్యం అని మౌలాలి కార్పొరేటర్ గున్నాల న్నాల సునీత శేఖర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మౌలాలి డివిజన్ పరిధిలోని సంతోషిమాత గుడి దగ్గర జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నాల పనులను ఏఈ మధురిమతో కలిసి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేట్ మాట్లాడుతూ త్వరగా నాలా పనులు పూర్తిచేయాలని అధికారులకు తెలిపారు.



## వైద్య ఆరోగ్య పద్దులో అరకొర కేటాయింపులపై లోక్‌సభలో గళమెత్తిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**తెలంగాణ వీణ/హనుమకొండ, ఆగస్టు 2:** యూపీఏ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య పథకాల పేర్లు మారుస్తూ మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అంకెల గారడి చేస్తూ పబ్బం గడుపుతున్నదని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బడ్జెట్ లో వైద్య ఆరోగ్య పద్దులపై శుక్రవారం పార్లమెంట్ లో కాంగ్రెస్ పక్షాన ఎంపీ డాక్టర్ కడియం కావ్య చర్చలో పాల్గొన్నారు. ఆయుష్మాన్ భారత్ పేరిట నెలకొల్పిన పథకం పేదల ఆయుష్షు పెరిగేందుకు ఉపకరించడం లేదని, అరకొర నిధులు వారిని ఆరోగ్యవంతులని చేసేలా లేవని కావ్య అభిప్రాయపడ్డారు. కేంద్రం కోవిడ్ మేనేజ్మెంట్ లో అనూహ్య విజయం సాధించిందని జబ్బలు చరుచుకుంటున్న అధికార పార్టీ, సాధారణ ఆరోగ్య రంగంలో చేస్తున్నది ఏమీ లేదని డాక్టర్ కడియం కావ్య ఎద్దేవ చేశారు. పలు ప్రధాన అంశాలలో వైద్య ఆరోగ్య సేవలను విస్తరింప చేయాలని జరిగిన కేటాయింపులు అరకొరగా ఉన్నాయని వీటి విషయంలో వైద్య ఆరోగ్యశాఖ సరైన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. క్వాంటిటీ కన్నా క్వాలిటీ ప్రధానమని ఈ విషయంలో మరింత వ్యూహాత్మకంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ సూచించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బాలికల ప్రధాన సమస్యల పట్ల ఉన్న చిత్తశుద్ధిని కొనియాడుతూ గతంలో తెలంగాణలో కూడా మెనుస్ట్రువల్ హైజీన్ విషయంలో తమ తండ్రి కడియం శ్రీహరి మంత్రిగా ఉన్నపుడు చేపట్టిన చర్యలను ఉదాహరించారు. క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల విషయంలో కుటుంబాలు ఇల్లు గుల్ల అవుతాయని, వారి ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని క్యాన్సర్ నిర్ధారక పరీక్షలు మొదలుకొని నివారణ వరకు చేపట్టే చర్యల్లో రాయితీలు కల్పించాలని డాక్టర్ కడియం కావ్య సూచించారు. నీట్ పరీక్ష పై ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని డాక్టర్ కావ్య దుయ్యబట్టారు. ఇది ఒక ప్రయోగాత్మక లీకేజీకి ఉదాహరణగా ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి లీకేజీ యోజన రూపంలో కూడా పథకాలు వస్తాయేమోనని వ్యంగంగా అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పది లక్షల రూపాయల వరకు కేటాయిస్తున్నదని స్పష్టం చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ లో అంతర్జాతీయ స్థాయిలో 24 అంతస్తుల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు కడియం కావ్య వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ వైద్య మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన 323 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యాన్ని ప్రధాన అంశంగా పరిగణిస్తూ వ్యక్తి ఆరోగ్యమే దేశ ఆరోగ్యానికి ఉపకరిస్తుందని ఆ దిశగా నిధులు విడుదల చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. కాజీపేట కేంద్రంగా గల రైల్వే జంక్షన్ 54 రైల్వే స్టేషన్లకు న్యూక్లియస్ గా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఇక్కడి రైల్వే ఉద్యోగులకు ప్రస్తుతం ఇక్కడ ఉన్న హాస్పిటల్ ద్వారా అందుతున్న సేవలు పరిమితంగా ఉన్నాయని ఎంపీ డాక్టర్ కావ్య తెలిపారు. ఉద్యోగుల అవసరాల రీత్యా సిజిహెచ్ఎస్, వెల్ నెస్ సెంటర్ వరంగల్ లో నెలకొల్పాలని వైద్య ఆరోగ్య మంత్రిని కోరారు. నిన్న ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం రాష్ట్రాలకు అధికారం ఇస్తూ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు. వర్గీకరణకు కృషి చేసిన ప్రతి ఒక్కరు అభినందనీయులని పార్లమెంట్ లో డాక్టర్ కడియం కావ్య ప్రస్తావించారు.





# ప్రిసిషన్ రౌండ్‌లో అదరగొట్టిన మనూ భాకర్

షూటర్ మనూ భాకర్ .. పారిస్ ఒలింపిక్స్‌లో మరో మెడల్‌పై కన్నేసింది. ఇవాళ జరుగుతున్న 25 మీటర్ల పిస్తోల్ ఈవెంట్‌లోని.. ప్రిసిషన్ రౌండ్‌లో ఆమె సంయుక్తంగా మూడవ స్థానంలో నిలుచున్నది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఆమె 294 పాయింట్లు సాధించింది. ఇక ఇదే ఈవెంట్‌లో మరో షూటర్ ఈషా కూడా మెరుగైన ప్రదర్శన ఇచ్చింది. 291 పాయింట్లతో ఆమె 10వ స్థానం లో నిలుచున్నది. ప్రిసిషన్ రౌండ్ తర్వాత ర్యాపిడ్ రౌండ్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించనున్నారు. అయితే రెండు రౌండ్లలో కలిపి టాప్ 8 స్థానాల్లో ఉన్నవారే ఫైనల్‌కు అర్హత సాధిస్తారు.

# స్వప్నిల్‌కు రైల్వే గిఫ్ట్..



పారిస్ ఒలింపిక్స్‌లో గురువారం జరిగిన పురుషుల 50 మీటర్ల 3-పొజిషన్ ఈవెంట్‌లో భారత షూటర్ స్వప్నిల్ కుసాలే కాంస్య పతకాన్ని సాధించి చరిత్ర సృష్టించాడు. అతను సాధించిన ఈ ప్రత్యేక విజయానికి సెంట్రల్ రైల్వే బహుమతి ఇచ్చింది. ఈ ఈవెంట్‌లో భారత్‌కు పతకం సాధించిన తొలి అథ్లెట్‌గా నిలిచాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో కుసాలే ఏడో స్థానంలో నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్ 2024లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నందుకు గాను.. భారత షూటర్ స్వప్నిల్ కుసాలే సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ సెల్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా పదోన్నతి పొందారు. ఇంతకు ముందు కుసాలే టిక్కెట్ కలెక్టర్‌గా పనిచేస్తుండే వాడు. మరోవైపు.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కుసాలేకు కోటి రూపాయల రివార్డును ప్రకటించారు. కుసాలేకు మహారాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల రివార్డును ప్రకటిస్తోందని, ఒలింపిక్స్ నుంచి తిరిగి రాగానే అతడికి ఘనంగా స్వాగతం పలుకుతామని షిండే తెలిపారు. మరోవైపు.. ఈరోజు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు భాగంగా.. స్పీకర్ ఓం బిర్లా స్వప్నిల్ కుసలేను అభినందించారు. పారిస్ ఒలింపిక్స్‌లో పురుషుల 50 మీటర్ల రైఫిల్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించిన స్వప్నిల్ కుసాలేను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అభినందించారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఏడో స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో కూడా, స్వప్నిల్ మోకాలి మరియు ప్రోన్ రౌండ్‌ల తర్వాత ఆరో స్థానంలో ఉన్నాడు. అతను స్టాండింగ్ పొజిషన్‌లో అద్భుతంగా పునరాగమనం చేసాడు. తన మొదటి ఒలింపిక్స్‌లో భారతదేశానికి పతకాన్ని సాధించాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో కుసాలే అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. 60 షాట్‌లలో 590 పాయింట్లతో మొదటి ఎనిమిది షూటర్‌లలో నిలిచాడు. ఇందులో 38 ఇన్నర్ 10లు ఉన్నాయి. కుసాలేతో పాటు మరో భారత షూటర్ ఐశ్వర్యప్రతాప్‌సింగ్‌తోమర్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో 589 పాయింట్లతో 11వ స్థానంలో నిలిచింది.

# చేతికి నల్ల రంగు బ్యాండ్లతో భారత ఆటగాళ్లు!!



మూడు మ్యాచుల టీ20 సిరీస్‌ను గెలిచి మంచి ఊపు మీదున్న టీమ్ ఇండియా అదే ఉత్సాహంతో వన్డే సిరీస్‌నూ కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలో కొలంబో వేదికగా శ్రీలంకతో తొలి వన్డే మ్యాచులో తలపడుతోంది. ఈ మ్యాచ్‌లో భారత ఆటగాళ్లు చేతికి నల్ల రంగు బ్యాండ్లతో బరిలోకి దిగారు. సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. భారత ఆటగాళ్లకు నల్ల రంగు బ్యాండ్లతో బరిలోకి దిగడానికి ఓ కారణం ఉంది. బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతూ టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ అన్షుమాన్ గైక్వాడ్ జూలై 31(బుధవారం) కన్నుమూశారు. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్, కోచ్ అన్షుమాన్ గైక్వాడ్ కు నివాళిగా టీమ్‌ఇండియా ఆటగాళ్లు నల్ల రంగు బ్యాండ్లలు ధరించారు. అన్షుమాన్ గైక్వాడ్ టీమ్‌ఇండియా తరుపున మొత్తం 40 టెస్టులు, 15 వన్డే మ్యాచ్ లు ఆడాడు. రెండింటిలో కలిపి 2254 పరుగులు చేశాడు. టెస్టుల్లో 1983లో జలంధర్ లో పాకిస్థాన్ పై 201 పరుగుల అత్యధిక స్కోరు చేశాడు. అంతేకాదు.. తన వన్డే కెరీర్ లో అతను రెండు సెంచరీలతో 1154 పరుగులు చేశాడు. గైక్వాడ్ 1997-1999 మధ్య, అదేవిధంగా 2000 సంవత్సరంలో రెండు దఫాలు భారత జట్టుకు ప్రధాన కోచ్ గా పనిచేశాడు. అతని కోచింగ్ లో భారత్ జట్టు 2000 సంవత్సరంలో ఛాంపియన్స్ ట్రోఫీలో రన్నరప్ గా నిలిచింది. అతను కోచ్ గా ఉన్న సమయంలోనే అనిల్ కుంబ్లే న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో టెస్టు ఇన్నింగ్స్ లో 10 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్ గా రికార్డు సృష్టించాడు. గైక్వాడ్ 1990లలో జాతీయ సెలెక్టర్ గా, ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా పనిచేశాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ గెలిచిన శ్రీలంక బ్యాటింగ్ ఎంచుకుంది. 25 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసింది. పాతుమ్ నిస్సాంక (51), జనిత్ లియానాగే (1) లు క్రీజులో ఉన్నారు.

# ఇంటర్వ్యూ కోసం బాబర్ ఆజమ్‌ను ఆ భారత క్రికెటర్ అడుక్కున్నాడు!




భారత క్రికెటర్లపై ఏదో కామెంట్ చేస్తూ పబ్బం గడుపుకోవడం పాకిస్థాన్ మాజీ క్రికెటర్లతో పాటు పాక్ అభిమానులకు కూడా బాగా అలవాటు అయినట్లు ఉంది. తాజాగా ఓ పాక్ అభిమాని.. టీమిండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్, పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్‌ను ఇంటర్వ్యూ కోసం అడుక్కుకుంటున్నాడంటూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశాడు. ఆ వీడియో బాగా వైరల్ అయింది. భారత్ వేదికగా జరిగిన 2023 వన్డే వరల్డ్ కప్‌లో బాబర్‌ను కామెంటేటర్‌గా ఉన్న ఇర్ఫాన్ పఠాన్.. ఇంటర్వ్యూ కోసం ప్రాథేయపడుతున్నట్లు అతను పేర్కొన్నాడు. అసలు ట్విస్ట్ ఏంటంటే.. ఆ వీడియోలో ఇర్ఫాన్ పఠాన్ లేనే లేడు. ఆ వీడియో టీమిండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ కంట్లో పడింది. అంతే.. ఆ వీడియోకు అదిరిపోయే కౌంటర్ ఇచ్చాడు భజ్జీ. అసలు అందుకో ఇర్ఫాన్ పఠాన్ ఎక్కడున్నాడు. అయినా.. ఇర్ఫాన్ పఠాన్‌కు ఇంటర్వ్యూ ఇస్తే.. ఇంగ్లీష్‌లో ఒక ప్రశ్న అడిగితే బాబర్ ఆజమ్‌కు చెమటలు పడతాయంటూ హర్భజన్ సింగ్ సెటైర్లు వేశాడు. భజ్జీతో పాటు భారత క్రికెట్ అభిమానులు కూడా ఆ వివాదాస్పద పోస్ట్‌పై విరుచుకుపడుతున్నారు. మీతో ఇంటర్వ్యూ చేయడానికి చిన్న చిన్న యూట్యూబర్లు సరిపోతారని, అందుకోసం భారత మాజీ క్రికెటర్లు అవసరం లేదని మండిపడుతున్నారు. కాగా, పాకిస్థాన్ మాజీ క్రికెటర్లు, పాక్ అభిమానులు చేసే అర్థం లేని ఆరోపణలకు ఇర్ఫాన్ పఠాన్ సరైన కౌంటర్ ఇస్తాడనే విషయం తెలిసిందే. అందుకే పాక్ అభిమానులు ఎక్కువగా ఇర్ఫాన్ పఠాన్‌ను టార్గెట్ చేస్తూ ఉంటారు. అయితే.. ఇప్పుడు ఇర్ఫాన్ పఠాన్‌కు హర్భజన్ సింగ్ మద్దతుగా నిలవడంతో భారత క్రికెట్ అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా.. పాకిస్థాన్ అభిమానులు ఇలాంటి చీప్ కామెంట్స్ కానీ, పోస్టులు కానీ చేసినప్పుడు.. భారత క్రికెటర్లు ఇలా రియాక్ట్ అయితే బాగుంటుందని కూడా క్రికెట్ ఫ్యాన్స్ అంటున్నారు. మరి ఈ విషయంపై మీ అభిప్రాయాలను కామెంట్ల రూపంలో తెలియజేయండి.

# 'నేను మీ కెప్టెన్ రోహిత్‌ని'..

## - అభిమానులకు హిట్ మ్యాన్ సందేశం



భారత క్రికెట్‌లో కొత్త శకం మొదలైంది. రాహుల్ ద్రవిడ్ నిష్క్రమణ, ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ నియామకం తర్వాత శ్రీలంకతో టీ20 సిరీస్‌లో టీమిండియా ప్రదర్శన కొత్త ఆశలను రేకెత్తించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో భారత్ అద్భుత ప్రదర్శన చూపి 3-0తో సిరీస్‌ని కైవసం చేసుకుంది. టీ20 ఫార్మాట్ తర్వాత ఇప్పుడు వన్డే ఫార్మాట్ వంతు వచ్చింది. రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు 50 ఓవర్ల ఫార్మాట్‌లో శ్రీలంకను క్లీన్ స్వీప్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే టీ20తో పోలిస్తే వన్డేల్లో భారత జట్టులో చాలా తేడా ఉంది. చాలా మంది అనుభవజ్ఞులు టీమిండియాకు తిరిగి వచ్చారు. భారత క్రికెట్‌లోని ఇద్దరు దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఎనిమిది నెలల తర్వాత వన్డేల్లో పునరాగమనం చేస్తున్నారు. దశాబ్ద కాలంగా 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఆధిపత్యం చెలాయించిన ఈ జోడీ.. గుర్తిండిపోయేలా పునరాగమనం చేయాలనే లక్ష్యంతో ఉంది. వీరిద్దరూ టీ20 ప్రపంచకప్ తర్వాత టీ20 ఇంటర్నేషనల్ నుంచి రిటైర్ అయ్యారు. ఇప్పుడు ఇద్దరూ వన్డేలు, టెస్టులపైనే పూర్తిగా దృష్టి సారించారు. గతేడాది వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్‌లో ఎదురైన ఓటమిని మరిచిపోయి కొత్త శుభారంభం చేయాలని వీరిద్దరూ భావిస్తున్నారు. వీరిద్దరితో పాటు కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్ కూడా వన్డే జట్టులోకి తిరిగి వచ్చారు. సిరీస్ ప్రారంభానికి ముందు.. రోహిత్ భారత క్రికెట్ అభిమానులందరికీ ప్రత్యేకమైన, భావోద్వేగ సందేశాన్ని ఇచ్చాడు. బీసీసీఐ షేర్ చేసిన వీడియో కొన్ని వారాల క్రితం అభిమానులు.. ఆటగాళ్లు పంచుకున్న అన్ని చిరస్మరణీయ క్షణాలను సంగ్రహించింది. బార్బడోస్‌లో రోహిత్ కెప్టెన్సీ షూట్ నుండి మెరైన్ డ్రైవ్ దగ్గర విజయ పరేడ్.. వాంఖడే స్టేడియంలో ప్రతిష్టాత్మకమైన సన్మాన కార్యక్రమం వరకు ఈ వీడియోలో చూపిస్తుంది. భారత్‌కు పొట్టి ఫార్మాట్‌లో ఆడాలనే కోరిక తనకు ఇంకా ఉందని రోహిత్ వీడియోలో చెప్పాడు. అభిమానులను ఉద్దేశించి కెప్టెన్ మాట్లాడుతూ, గత నెల రోజులు తనకు చాలా ప్రత్యేకమైనవని.. జ్ఞాపకాలతో నిండిపోయాయని అన్నాడు. గత నెల జ్ఞాపకాలతో నిండిన నెల.. చరిత్రలో నిలిచిపోయింది.. అది ఎప్పటికీ తనతో నిలిచిపోయే క్షణం అని తెలిపాడు. ఈ సిరీస్ కొత్త, పాత ప్రతిభతో కొత్త శకానికి నాంది పలుకుతుందని రోహిత్ చెప్పాడు. 'కొత్త శకానికి నాంది పలికి మళ్లీ మైదానంలోకి రావాల్సిన సమయం ఆసన్నమైంది. కొత్త కోచ్‌తో కొత్త ప్రారంభం.. భారత క్రికెట్‌కు అత్యంత ప్రాధాన్యతనిచ్చే భాగస్వామ్యం.. రీసెట్ బటన్‌ను నొక్కడానికి ఇది మంచి సమయం.. నేను మళ్లీ మైదానంలోకి రావాల్సిన సమయం వచ్చింది. అదే శక్తి, ఉత్సాహంతో టీమ్ ఇండియా కొంత మంది కొత్త, మరికొంత పాత ముఖాలతో మైదానంలోకి దిగనుంది. ఇది టీమ్ ఇండియా, ఇది మీ కెప్టెన్ రోహిత్ శర్మ.' అని అన్నాడు. ఆగస్టు 2 నుంచి మూడు వన్డేల సిరీస్‌లో శ్రీలంకతో భారత్ ఆడనుంది. సిరీస్‌లో చివరి మ్యాచ్ ఆగస్టు 7న జరగనుంది.



# అర్హత లేని బాక్సర్‌ను బరిలోకి దింపి మోసం..

పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్ క్రీడల్లో మోసం జరిగిందని ఆరోపణలున్నాయి. ఆగస్టు 1న జరిగిన మహిళల 66 కేజీల వెయిట్ కేటగిరీ బౌట్‌పై వివాదం మొదలైంది. ఇటలీకి చెందిన ఏంజెలా కారినీ, అల్జీరియాకు చెందిన ఇమాన్ ఖలీఫ్‌లు ముఖాముఖి తలపడగా, ఏంజెలా కేవలం 46 సెకన్ల వ్యవధిలో మ్యాచ్ నుంచి వైదొలిగింది. దీంతో అల్జీరియా బాక్సర్ ఇమాన్ ఖలీఫ్ విజేతగా నిలిచింది. ఈ వివాదమంతా ఇమాన్ ఖలీఫ్ 'జెండర్ చెక్'కి సంబంధించినది. నిజానికి, ఇమాన్ ఖలీఫ్ శరీరంలో టెస్టోస్టెరాన్ హార్మోన్ మొత్తం అసాధారణంగా ఉంది. ఈ కారణంగా, ఆమె 'లింగ పరీక్ష'లో విఫలమవడంతో 2023 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించలేదు. ఆ తర్వాత ఆమెకు పారిస్ ఒలింపిక్స్‌లో చోటు దక్కడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేని వారిని ఒలింపిక్స్‌లో ఆడించడంపై విమర్శలు వస్తున్నాయి. జెండర్ టెస్టులో ఫెయిల్ అయిన బాక్సర్లు మహిళా బాక్సర్లతో పోటీ పడేందుకు ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ అనుమతిచ్చింది. గత సంవత్సరం ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో, ఆమెలో టెస్టోస్టెరాన్ స్థాయిలు పెరిగినట్లు పరీక్షలు పేర్కొన్న తర్వాత గోల్డ్ మెడల్ మ్యాచ్‌కు ముందు వైదొలగాల్సి వచ్చింది. ఇప్పుడు ఒలంపిక్స్‌లో ఇమాన్ ఖలీఫ్ తొలి మ్యాచ్ గెలిచిన తర్వాత.. ఓ మహిళ ముందు పురుషుడిని ఎందుకు బరిలోకి దింపారనే ప్రశ్నలు సోషల్ మీడియాలో తలెత్తుతున్నాయి. ఐబీఏ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)పై కూడా ప్రశ్నలు సంధించింది.

# వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం ఫ్రాంచైజీలు రిటైన్ చేసుకునేదెవారిని?

వచ్చే ఐపీఎల్ సీజన్ (2025) నుంచి అన్ని ఫ్రాంచైజీలు ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకునే అవకాశం ఉందని తెలుస్తుంది. నిన్న (జులై 31) జరిగిన బీసీసీఐ-ఐపీఎల్ ఫ్రాంచైజీల యజమానుల సమావేశంలో ఈ అంశంపై క్లారిటీ వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకోబోయే ఆటగాళ్ల జాబితాపై కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తుంది. ప్రతి ఫ్రాంచైజీ విదేశీ, స్వదేశీ, క్యాప్డ్, అన్‌క్యాప్డ్ ప్లేయర్ల పేర్లతో కూడిన జాబితాకు తుది మెరుగులు దిద్దుతున్నట్లు సమాచారం.






## ఉలర్ఝ్‌తో ముందుకొచ్చిన జాన్వీ

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ శుక్రవారం ఉలర్ఝ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, కథల ఎంపికపై ఆసక్తికర వ్యాఖ్యాలు చేశారు. 'కెరీర్‌ను మార్చే అవకాశమైనా.. జుట్టు లేకుండా కనిపించే పాత్రను అంగీకరించను అన్నారు. 'ఎలాంటి పాత్రలో నటించకూడదని నిర్ణయించుకున్నారు?' అని యాంకర్ అడగ్గా జాన్వీ స్పందించారు. 'హెయిర్ లేకుండా నటించాల్సి వస్తే నేనెప్పుడూ సున్నితంగా తిరస్కరిస్తా. ఎంత కష్టమైన పాత్రైనా చేస్తాను కానీ జుట్టు లేకుండా కనిపించేందుకు ఇష్టపడను. 'ఉలర్ఝ్'లోని పాత్ర కోసం దర్శకుడు నా హెయిర్‌ను కొంత కట్ చేయాలని సూచించారు. అందుకు నేను ఆయనతో గొడవపడ్డా నా తొలి సినిమా 'ధడక్' కోసం జుట్టు కత్తిరించుకున్నా. 'ఎందుకిలా చేశావ్?' అంటూ మా అమ్మ అరిచింది. ఏ రోల్ కోసమైనా హెయిర్ కట్ చేసుకోవద్దని చెప్పింది. నా జుట్టంటే ఆమెకు అంత ఇష్టం. మూడ్రోజులకోసారి ఆయిల్ రాసి మసాజ్ చేస్తది. అమ్మ కారణంగానే హెయిర్ కట్ చేసుకోను' అని అంది జాన్వీకపూర్. గుల్షన్ , జాన్వీకపూర్, రోషన్ మాథ్యు కలిసి నటించిన చిత్రమిది. దేశభక్తి కథాంశంతో ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్‌గా రూపొందింది. జాతీయ అవార్డు గ్రహీత సుధాన్షు సరియా దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఆమె తెలుగులో దేవర చిత్రంలో నటిస్తోంది. రెండు పార్టులుగా ఈ చిత్రం తెరకెక్కనుంది. తదుపరి రామ్‌చరణ్, సానా బుచ్చిబాబు కాంబోలో తెరకెక్కే చిత్రంలో ఆమె అవకాశం అందుకుంది.

## కాలం చెల్లిన కథతో ..తిరగబడరసామీ !

గతవారం 'పురుషోత్తముడు' అంటూ పలకరించిన రాజ్‌తరుణ్ ఈ శుక్రవారం 'తిరగబడరసామీ' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో రాజ్‌తరుణ్ వ్యక్తిగత జీవితం, వివాదాలు హాట్‌టాపిక్.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బ్యాక్ టు బ్యాక్ వచ్చిన ఈ చిత్రం ఎలా ఉందన్న ఆసక్తి కలుగుతోంది.గిరి (రాజ్‌తరుణ్) చిన్నప్పుడే అమ్మానాన్నలకు దూరమవుతాడు. అనాథలా పెరిగి పెద్దవుతాడు. తనలా కుటుంబాలకు దూరమైన వాళ్లని వెతికిపట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించడమే పనిగా పెట్టుకుంటాడు. అలా అతని పేరు అందరికీ తెలిసిపోతుంది. ఓ టీవీ ఇంటర్వ్యూలో గిరిని చూసిన శైలజ (మాల్వి మల్హోత్రా) దగ్గరవుతుంది. ఆ తర్వాత ఇద్దరూ ప్రేమలో పడతారు. పెళ్లితో ఒక్కటవుతారు. ఇంతలో కొండారెడ్డి (మకరంద్ దేశ్‌పాండే) ముఠా శైలజ కోసం వేట మొదలుపెడుతుంది. గిరి గురించి తెలుసుకుని అతన్ని కూడా పిలిపించి శైలజని వెతికి పెట్టాలని లేదంటే ప్రాణాలతో ఉండవని బెదిరిస్తాడు. తన భార్య శైలజ రూ.2 వేల కోట్ల ఆస్తికి వారసురాలని తెలిశాక గిరి ఏం చేశాడు? ఇంతకీ శైలజకీ, కొండారెడ్డికీ సంబంధ మేమిటి? తన భార్యని కాపాడుకోవడం కోసం గిరి ఏం చేశాడు? తదితర విషయాలతో కథ సాగుతుంది.ఒకవైపు వెబ్‌సిరీస్‌లు కట్టి పడేస్తున్నాయి. మరోవైపు లార్జర్ దేన్ లైఫ్ తరహా భారీ సినిమాలు థియేటర్లలో వారానికొకటి సందడి చేస్తున్నాయి. వీటి మధ్య పరిమిత వ్యయంతో కూడిన సినిమా చూడాలంటే అందులో ఏదో ప్రత్యేకత ఉండి తీరాల్సిందే. కథ, కథనాల్లో కొత్తదనం.. హాస్యం.. హృద్యమైన భావోద్వేగాలో ఇలా ప్రేక్షకుడిని కట్టిపడేయాల్సిన అంశం ఉండాలి. మూసధోరణిలో సాగే సినిమాలకైతే ఎప్పుడో మంగళం పాడేశాడు నవతరం ప్రేక్షకుడు. అది ప్రతిసారీ రుజువవుతున్నా ఇంకా ఆ తరహా ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. 'తిరగబడర సామీ' కూడా ఆ తాను ముక్కే. ఊహకు అందే కథ, కథనాలతో ఏ దశలోనూ ఆసక్తిని రేకెత్తించదు ఈ సినిమా. ప్రేక్షకుడి మనసును తాకే భావోద్వేగాలు, కాసేపు కాలక్షేపాన్నిచ్చే హాస్యం కానీ మచ్చుకైనా కనిపించవు. యువ జంట నటించిన సినిమా కదా, సరదా సన్నివేశాలు, ప్రేమ నేపథ్యమేదైనా ఉంటుందేమో అని ఆశిస్తే అదీ భంగపాటే. కొండారెడ్డి ముఠా వేట, హీరో హీరోయిన్ల పరిచయ సన్నివేశాలు, ఆ తర్వాత ప్రేమ, పెళ్లి... ఇలా




సాదాసీదాగా సాగుతుంది చిత్రం. విరామం ఎపిసోడ్ కూడా ప్రేక్షకుడు ఊహించిందే. విరామం తర్వాత శైలజని కొండారెడ్డి ముఠా నుంచి కాపాడుకోవడం కోసం హీరో వేసే ఎత్తుగడలు, ఆమె నేపథ్యంతో సాగే కొన్ని సన్నివేశాలు పర్వాలేదనిపించినా, ఆ తర్వాత మళ్లీ మామూలే. కొండారెడ్డి ముందుకెళ్లి హీరో ఎలా తిరగబడ్డాడనేది పతాక సన్నివేశాల్లో చూపించారు. రెండు గంటల నిడివి కూడా లేని ఈ సినిమా, కాలం చెల్లిన కథ, పాత్రలు, సన్నివేశాలతో ప్రేక్షకుల సహనానికి పరీక్షలా అనిపిస్తుంది.

## అక్షయ్ ఖేల్‌ఖేల్‌మే ట్రైలర్ విడుదల

బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్, తాప్సీ పన్ను ప్రధాన పాత్రల్లో వస్తున్న తాజా చిత్రం 'ఖేల్ ఖేల్ మే'. ఈ సినిమాకు ముదస్సర్ అజీజ్ దర్శకత్వం వహిస్తున్నాడు. కామెడీ , ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో వాణి కపూర్, అమ్మీ విర్క్, ఆదిత్య సీల్, ప్రగ్యా జైస్వాల్, ఫర్దీన్ ఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఇండిపెండెన్స్ కానుకగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడటంతో మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్.ఈ ట్రైలర్ చూస్తే.. తమిళంలో హిట్ అయిన లవ్ టూడే సినిమా స్టోరీ కాన్సెప్ట్‌తో ఈ మూవీ రాబోతున్నట్లు తెలుస్తుంది. అక్షయ్ కుమార్, తాప్సీ, వాణి కపూర్ అంతా ఫ్రెండ్స్. ఒక పార్టీలో వీళ్లందరు కలుసుకోని ఒక గేమ్ ఆడదాం అనుకుంటారు. ఇంతకీ ఆ గేమ్ ఏంటి అంటే.. అందరు తమ ఫోన్స్ అన్ లాక్ చేసి చూపించాలి. అయితే ఆ ఫోన్స్‌లో ఏం ఉంది అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ప్రస్తుతం జనరేషన్‌లో మొబైల్స్‌కి అలవాటు పడిన జనాలు ఏం చేస్తున్నారు. ఏం చూస్తున్నారు అనే స్టోరీతో కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ చిత్రం 2016 ఇటాలియన్ కామెడీ థ్రిల్లర్ 'పర్ఫెక్ట్ స్టేం÷–రజర్స్ కి రీమేక్.




## దర్శకుడు అజయ్ శాస్త్రి కన్నుమూత

### - ఏమోషనల్ పోస్ట్ పెట్టిన మంచు మనోజ్



మంచు మనోజ్ హీరోగా తెరకెక్కిన 'నేను మీకు తెలుసా' దర్శకుడు అజయ్ శాస్త్రి కన్నుమూశారు. ఈ విషయాన్ని హీరో మనోజ్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఆయన మరణం తనను ఎంతో బాధించిందంటూ మంచు మనోజ్ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకుంటూ ఆయనతో ఉన్న జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. 'నా మిత్రుడు, 'నేను మీకు తెలుసా' దర్శకుడు అజయ్ శాస్త్రి ఇక లేరనే వార్త కలచి వేస్తోంది. మాటల్లో వర్ణించ లేనంత బాధగా ఉంది. ఆయన కుటుంబ సభ్యులకు మానసిక ధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని కోరుకుంటున్నా. చాలా త్వరగా వెళ్లిపోయావ్ అజయ్. నిన్ను ఎప్పటికీ మిస్ అవుతూనే ఉంటాను. ఇది కల అయితే బాగుండనిపిస్తోంది. నువ్వు లేకుండా జీవితం ఎప్పటిలా ఉండదు. ఎప్పటికీ నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను' అని రాసుకొచ్చారు. మంచు మనోజ్ నటించిన 'నేను మీకు తెలుసా'చిత్రం 2008లో విడుదలై.. హిట్‌గా నిలిచింది. అజయ్ దర్శకత్వం వహించిన ఏకైక సినిమా ఇది.

## ఉషా పరిణయం రివ్యూ: పబ్లిక్ టాక్

నువ్వే కావాలి, మన్మథుడు, నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరీ లాంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు కె.విజయభాస్కర్ చాలా కాలం విరామం తరువాత తెరకెక్కించిన చిత్రం 'ఉషా పరిణయం'. విజయభాస్కర్ తనయుడు శ్రీకమల్ హీరోగా, తాన్వీ ఆకాంక్ష హీరోయిన్‌గా తెరకెక్కిన ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రాన్ని విజయ భాస్కర్ తన సొంత నిర్మాణ సంస్థపై నిర్మించాడు.

## 'మహారాజ' సినిమా దర్శకుడిని అభినందించిన రజినీకాంత్

తమిళ నటుడు విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ మహారాజ . భారీ అంచనాల నడుమ జూలై 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తమిళంతో పాటు తెలుగులో మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. తమిళనాడులో రూ.100 కోట్ల వసూళ్లను రాబట్టడమే కాకుండా విజయ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోయింది ఈ చిత్రం. అయితే ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చిన అనంతరం ఓటీటీలో కూడా రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇప్పటికే ఈ మూవీ చూసిన కోలీవుడ్ హీరో, తమిళ వెట్రి కళగం పార్టీ అధినేత దళపతి విజయ్ చిత్రంపై ప్రశంసలు కురిపించడమే కాకుండా.. చిత్ర దర్శకుడు నిథిలన్ స్వామినాథన్‌ను కలుసుకుని ప్రత్యేకంగా అభినందించాడు.












Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written